ఈ వారం కథ

# అంతరాలు

మారసాని విజయ్‌బాబు

బొంబాయి.

దాదర్ రైల్వేస్టేషన్

రైలు దిగిన వెంకట్రామయ్య ఎటువైపు వెళ్ళాలో తెలియక వుక్కిరి బిక్కిరి అవుతున్నాడు. ఆయన ముందు అటూ ఇటూ ఎన్నో రైళ్ళు దూసుకుపోతున్నాయి. చుట్టూ జన సముద్రం. సముద్రపు అలల్లాగే హోరుమని ఆడామగ అన్న తేడా లేకుండా ప్రతి ఒక్కరు పరుగులాగే నడుస్తున్నారు. శాంతాక్రజ్‌కు ఎలా వెళ్ళాలో ఆయనకు తెలియడం లేదు. పక్కనే వున్న ఓ వ్యక్తిని అడిగాడు.

"నేను కూడా కొత్త. మా స్నేహితుని కోసం ఎదురుచూస్తున్నాన"ని ఆ వ్యక్తి నవ్వుతూ సమాధానం ఇచ్చాడు. ఇలా వెంకట్రామయ్య ఇద్దరు ముగ్గుర్ని అడిగిన తర్వాత, ఒకటో నెంబరు ప్లాట్‌ఫాం వైపు నడిచాడు. చాలామంది బ్రిడ్జిపైనుంచి హడావిడిగా దిగుతూ వుంటే ఆయన కూడా వారితో పాటే దిగాడు. అయితే అది ఒకటో ప్లాట్‌ఫాం కాదు, రెండోది. ఆయన రోడ్డు క్రాస్ చేయాలనుకొని అటూ ఇటూ చూశాడు. దగ్గర్లోనే ట్రైన్ వస్తోంది. అది వెళ్ళేంతవరకు ఆగి, ముందుకు నడిచాడు. ఇంతలో "అరే" అంటూ ఆయన్ని వెనక్కు లాగాడు ఓ యువకుడు. 'ఏమైంది?' అని వెంకట్రామయ్య అడిగేలోపలే, ఆయన ముందునుంచి ఓ ట్రైన్ దూసుకువెళ్ళింది. ఒక్కసారిగా ఆయన అపాద మస్తకమూ వొణికిపోయాడు. ఆ యువకునివైపు కృతజ్ఞతగా చూశాడు. ఒక్కక్షణం ఆలస్యం అయివుంటే తన శరీరం నుజ్జునుజ్జు అయి వుండేది. ట్రైను వెళ్ళిన వెంటనే మళ్ళీ ట్రైను వస్తుందనే ఆలోచన కూడా తనలో లేదు. తాను పెరిగిన వాతావరణం అలాంటిది. తన వూరులో తాను అప్రమత్తంగా వుంటాడు. కానీ, ఈ పరిసరాలకు అది చాలదని గుర్తించాడు. దీనికి కొంత శిక్షణ కావాలి, అలవాటు పడాలి, మనిషికి ప్రపంచం తెలియాలి.

ఆయనకు భార్యాపిల్లలు గుర్తొచ్చారు. మగపిల్లలు ఇద్దరి గురించీ చింతలేదు. మిగిలింది కూతురు శాంత. ఆయన దిగులంతా కూతురు గురించే. ఆమెకేదైనా దారి దొరికితే, ఆపైన తన కేమైనా ఫర్వాలేదు. ట్రైను రావడంతో ఆలోచనలు కదలిపోయాయి. ప్రయాణీకులు హోరుమని శబ్దం చేసుకుంటూ దబదబామని దిగుతున్నారు. ఎక్కేవాళ్ళు ఒకర్నొకరు తోసుకుంటూ ఎక్కుతున్నారు. ఇంతలో ట్రైన్ కదిలింది. ఈ రద్దీలో ఆయన ఎక్కలేకపోయాడు. కష్టం అయింది. వచ్చే ట్రైన్‌లోనైనా ఎక్కగలనో లేదో నన్న అనుమానం కలిగింది. తన కన్నా ఇక్కడి ఆడవాళ్ళే నయం. వాళ్ళు మగవాళ్ళు వున్నారన్న ఆలోచన కూడా లేకుండా మనుషుల్ని తోసుకుంటూ రైలెక్కారు. మగవాళ్ళ మధ్యలో వాళ్ళు బాగా నలిగిపోయారు. అయినా వాళ్ళేమి అవస్థపడలేదు. అసలు లెక్క చేసినట్లు లేదు. ఇక్కడ నా భార్య వుండి వుంటే, ఈ రద్దీలో రైలు ఎక్కగలిగేదా? ఎక్కడం అలా వుంచితే, మగవాళ్ళ శరీర స్పర్శ సహించగలదా! ప్రాణం తీసుకుంటుందే గానీ, ఇలా మగవాళ్ళ మధ్యలో నలగడానికి ఒప్పకోదు. అయితే వీళ్ళు ఆడవాళ్ళు కాదా! చిన్నప్పటినుంచి నా భార్య ఈ వాతావరణంలో పెరిగి వుంటే! ఇలానే వుండేదా? వూహించలేకపోతున్నాడు.

ట్రైన్ వచ్చింది. ఈసారి ఆలస్యం చేయకుండా జనాన్ని తోసుకుంటూ రైలెక్కేశాడు. ఎక్కిన తర్వాత తెలిసింది, దిగడం కూడా కష్టమేనని.

** ** **

స్నేహితుని రాకకు విశ్వనాథం దంపతులు చాలా సంతోషపడ్డారు. వాళ్ళిద్దరూ ఉద్యోగాలు చేస్తున్నారు. ఇల్లు ముచ్చటగా, అందంగా అలంకరించి వుంది. వెంకట్రామయ్య స్నానం చేసిన తర్వాత, అందరూ హాలులో కూర్చుని కబుర్లు చెప్పుకొంటున్నారు. ఇంతలో ఓ అమ్మాయి లోపలికి వచ్చింది. ఆమె హాఫ్ ప్యాంటుపై టీ షర్టు వేసుకొని వుంది. ఆమె వెనుకనే మరో యువకుడు వచ్చాడు.

"హాయ్ డాడ్!" అంటూ విశ్వనాథంను పలకరించింది. విశ్వనాథం వెంకట్రామయ్యకు పరిచయం చేస్తూ, "గుర్తుపట్టలేదా, ఏమిట్రా స్వీటీరా. ఇది చిన్నగా వున్నప్పుడు ఒక్క క్షణం వదిలేవాడివి కాదు కదా! స్వీటీ, ఈయన నా స్నేహితుడు వెంకట్రామయ్య. తిరుపతి నుంచి వచ్చారు."

"బాగున్నారా అంకుల్, నాన్న ఎప్పుడూ మీ గురించే చెబుతూ వుంటారు. "మృదువుగా పలకరించింది. తర్వాత, "మమ్మీ శాంకీ కూడా ఇక్కడే భోజనం చేస్తాడు" అని చెప్పి "రా శాంకీ" అంటూ తన రూమ్‌లోకి వెళ్ళింది.

అది స్వీటీ సొంత గది. గోడకు ఓ వైపు మైకేల్ జాక్సన్ ల్యామినేషన్ ఫోటో, స్టీరియో రికార్డు ప్లే, పొందిగ్గా అమర్చిన క్యాసెట్స్, బెడ్‌పై పరచిన తెల్లటి కార్పెట్, దానిపై అందంగా అల్లిన పువ్వులూ, ఓ మూల కుర్చీ టేబుల్, టేబుల్‌పై రకరకాల దిన వారపత్రికలు, పక్కనే వున్న ర్యాక్‌లో పుస్తకాలు.

స్వీటి ముదురు నీలంరంగు షిఫాన్ చుడీదార్ వేసుకొని, వేళ్ళతో చిక్కు తీసుకొంటూ, నవ్వుతూ వచ్చి శాంకీ పక్కన కూర్చుంది. శాంకీ చదువుతున్న పుస్తకాన్ని పక్కన పెట్టి, ఆమె బుగ్గపై వున్న చిన్ని సొట్టను చూస్తున్నాడు.

"హేయ్ శాంకీ, ఏమిటా చూపులు."

"స్వీటీ! మనిద్దరం ఎప్పటికీ ఇలా స్నేహితులుగానే వుంటామా?

"వుండలేకపోవచ్చు. మన లక్ష్యాలు ఒకటి కాదు కదా!"

ఉదయం నిద్రలేవగానే వెంకట్రామయ్య హాలులోకి వచ్చాడు. అప్పుడు విశ్వనాథం వాక్యూమ్ క్లీనర్‌తో హాలును శుభ్రం చేస్తున్నాడు.

"నువ్వూడుస్తున్నావేమిట్రా!" ఆశ్చర్యపోయాడు వెంకట్రామయ్య.

విశ్వనాథం నవ్వుతూ, "ఇక్కడెవ్వరికీ ప్రత్యేకమైన పనులంటూ లేవు. ఇంటి పనిని అందరం కలిసే చేసుకుంటాం."

స్నేసితుని జీవితం వెంకట్రామయ్యను స్పందింపచేసింది. విశ్వనాథం దంపతులు హాయిగా నవ్వుతూ స్నేహితుల్లాగా వుండటం ఆయనకు ఆశ్చర్యమే మరి. ఆయన చుట్టుపక్కల వున్న వాతావరణం వేరే. ఇంత ఇదిగా ఎవ్వరూ లేరు. ఒక్క మాటలో చెప్పాలంటే ఆయన అనుభవంలో ఇలాంటి దంపతులను చూడలేదు.

రాత్రి భోజనాలు అయిన తర్వాత, మిత్రులు ఇద్దరూ మాట్లాడుకుంటున్నారు. అక్కడ ఇంకెవ్వరూ లేరు.

"నీకు ఎలా చెప్పాలో అర్థంకావడంలేదు" అంటూ కొంచెం నీళ్ళు నమిలాడు వెంకట్రామయ్య. "స్వీటి ప్రవర్తన చూస్తుంటే నాకేదో భయంగా వుంది. అన్నీ తెలుస్తున్నా, నువ్వేమో నిమ్మకు నీరెత్తినట్లున్నావు. పెళ్ళి కావల్సిన పిల్ల. రేపేదైనా అనుకోనిది జరిగితే, దాని భవిష్యత్..." ఇంకా ఏదో చెప్పాలనుకొన్నాడు.

"వెంకట్! ఇప్పటి పిల్లలు తమ జీవితాలకి సంబంధించిన విషయాల్లో చాలా జాగ్రత్తగా వుంటున్నారు. వాళ్ళేదైనా చేస్తున్నారంటే దానివల్ల ఏర్పడే సమస్యలకు కూడా వాళ్ళు సిద్ధపడే వుంటారు.

జీవితంలో మనకు ఎన్నో సమస్యలు ఎదురుపడుతుంటాయి. అందులో సెక్స్‌కి సంబంధించినవి కూడా. సెక్స్ సమస్యలను మేం స్వీటీతో మాట్లాడుతూ వుంటాం. స్వీటీ కూడా మాతో చర్చిస్తూ వుంటుంది. మేం కేవలం తల్లి దండ్రులుగానే వుండి, మా మధ్య గోడను కట్టుకోవాలనుకోవడం లేదు. అందుకే స్నేహితులుగా వుంటున్నాం."

విశ్వనాథం ఇలా మాట్లాడుతూనే వున్నాడు. వెంకట్రామయ్యకు అర్థం అయీ కాకుండా వున్నాయి. ఆయన ముందు అటూ ఇటూ ఎన్నో రైళ్ళు దూసుకుపోతున్నాయి.

